క్లుప్తంగా

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి



శేరేపాలెం గ్రామ సభలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

మొగల్తూరు: భూ రీ-సర్వేకు సంబంధించి నిర్వహిస్తున్న గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ సూచించారు. మండలంలోని శేరేపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో ఏమైనా లోటుపాట్లు ఉన్నా, భూ మార్పిడిలు జరిగినా, సరిహద్దు సమస్యలున్నా తమకు లిఖిత పూర్వకంగా, భూమికి సంబంధించిన రికార్డులతో పిర్యాదు చేయాలన్నారు. తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్ తణుకుల మునేశ్వరరావు, ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్, సర్వేయర్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



పెనుగొండలో పంచాయతీ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న అంజనేయులు

పెనుగొండ: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ, జిల్లా పంచాయతీ ఉద్యోగులు, వర్కర్స్ యూనియన్ నాయకుడు ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం పెనుగొండలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాయతీ కార్మికుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికులకు పనిభారం తగ్గించాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ పెనుగొండ మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు, బంగారు విజయ, బంగారు లక్ష్మీ, బొత్స లక్ష్మీ, కడిమి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో హెల్త్ ఈవెంట్స్‌లో భాగంగా స్థానిక వైష్ణవి స్కూల్‌లో విద్యార్థులకు ఉచిత దంత, ఈఎన్‌టీ పరీక్షలు నిర్వహించారు. బుధవారం పాఠశాలలో ఈఎన్‌టీ వైద్యులు రుద్రరాజు జైదుర్గదేవి, దంత వైద్యురాలు కావలి మౌనిలు విద్యార్థులకు పరీక్షలు చేసి పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు యామన విజయలక్ష్మి, సెక్రటరీ దేవరపు కాంచనమాల, ట్రెజరర్ శిద్దిరెడ్డి శైలజరాణి, పాఠశాల డైరెక్టర్ రమా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీ నిర్లక్ష్యంపై ఫిర్యాదు



డీఎంఅండ్ హెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తున్న సాయిదుర్గ

భీమవరం(ప్రకాశం చౌక్): పీఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. బాధితుడు కుమార్తె వీరవల్లి సాయి దుర్గ బుధవారం జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మొగల్తూరు మండలం కాళీపట్నం గ్రామానికి చెందిన పితాని రాజు ఈనెల 9న జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతూ పీఎంపీ వైద్యుడు కటికిరెడ్డి జగన్నాథరావు వద్దకు తీసుకు వెళ్లారు. 14వ తేదీ వరకు రాజుకు జగన్నాథరావు వైద్యం చేశారు. అయినా నయం కాకపోవడంతో రాజు కుమార్తె సాయిదుర్గ తన తండ్రిని పెద్దా సుపత్రికి తీసుకువెళతానని చెప్పింది. అవసరం లేదని చెప్పి మరో వ్యక్తిని తీసుకువచ్చి రాజుకు ఇంటి వద్దే జగన్నాథరావు ఆపరేషన్ చేశాడు. ఇందుకు రూ.44 వేలు వసూలు చేశాడు. మూడు రోజులు గడిచిన తర్వాత రాజు ఆరోగ్యం క్షీణించడంతో కుమార్తె సాయిదుర్గా నరసాపురంలో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ జాయిన్ చేసుకోవడానికి నిరాకరించడంతో ప్రస్తుతం పాలకొల్లులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నారు. పీఎంపీ జగన్నాథరావు నిర్లక్ష్యంతో రాజు రెండు వరిబీజాలు దెబ్బతినడంతో డాక్టర్లు ఒకటి తొలగించారు. తన తండ్రికి జరిగిన అన్యాయంపై కుమార్తె సాయిదుర్గ మొగల్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే ఫిర్యాదు చేసింది. అలాగే బుధవారం డీఎంహెచ్‌వోకు కలిసి ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి సదరు పీఎంపీపై చర్యలు తీసుకుంటామని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు.

మద్యం షాపు వద్దు.. మహాప్రభో

- పెనుమదంలో మద్యం షాపు తొలగించాలని ఆందోళ
- హైస్కూల్‌కి వెళ్లే దారిలో మద్యం షాపు ఏర్పాటుతో విద్యార్థుల ఇక్కట్లు



పెనుమదంలో మద్యం షాపును తొలగించాలని ధర్నా చేస్తున్న ప్రజలు



పోడూరు మండలం పెనుమదంలో ఏర్పాటు చేసిన మద్యం షాపు

పాలకొల్లు అర్బన్: పోడూరు మండలం పెనుమదం గ్రామంలోని చిట్టితగుంట వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణం తొలగించాలని బుధవారం ఆ గ్రామానికి చెందిన మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆందోళనకు దిగారు. మద్యంషాపులో మద్యం విక్రయిస్తున్న సిబ్బందిని బయటకు పంపించి షాపుకి తాళం వేసి ఆందోళన చేపట్టారు. ఎక్సైజ్ అధికారులు వచ్చి మద్యం షాపు తొలగిస్తామని హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించమని పట్టుబట్టారు. హైస్కూల్‌కి వెళ్లే రోడ్డులో ఈ మద్యం షాపును ఏర్పాటు చేయడం వల్ల మందుబాబులు ఆగడాలు పెచ్చుమీరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల పుస్తకాలు లాగేసుకుని చేలల్లోకి విసిరేస్తున్నారని దీంతో విద్యార్థులు భయాందోళనలకు గురై పాఠశాలలకు వెళ్లమంటూ ఇంటి వద్దే ఉండిపోతున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ షాపు ఏర్పాటు చేసి 15 రోజులైందని అయితే ఈ కొద్ది సమయంలోనే మందుబాబులు దొంగతనాలు, మహిళలపై దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని వాపోతున్నారు. తక్షణం ఇక్కడ మద్యంషాపు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

మంత్రి మోసం చేశారు



పది రోజుల క్రితం ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకువెళ్లాం. ఎక్సైజ్ సీఐ దృష్టికి కూడా తీసుకువెళ్లాం. చిట్టితగుంట వెళ్లే రోడ్డులో మద్యం షాపును తొలగిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు.

– దేవరపు మంగతాయారు, పెనుమదం

మహిళలపై దాడులు



ఈ రోడ్డుపై వెళుతున్న మహిళలపై మందుబాబులు దాడులు చేస్తున్నారు. ఇటీవల ఓ వృద్ధురాలిపై మద్యం మత్తులో ఓ యువకుడు దాడి చేసి గొంతు నులిమి మెడలో ఉన్న బంగారు తాడు లాక్కెళ్లిపోయాడు. ఆ వృద్ధురాలు లబోదిబోమంటూ కేకలు వేస్తే పారిపోయాడు.

– శీలం కనకమహాలక్ష్మి, చిట్టితగుంట

బండితో గుద్ది వెళ్లిపోయారు



నాకు ఇదే రోడ్డులో వ్యవసాయ భూమి ఉంది. సైకిల్‌పై వెళుతున్న నన్ను మందుబాబు మోటార్‌సైకిల్‌తో గుద్ది పారిపోయాడు. తలకు గాయమయ్యింది. స్కానింగ్ తీసుకుంటే రూ.7 వేలు ఖర్చు అయ్యింది. ఖాళీ సీసాలు వరిచేలల్లో విసిరేస్తున్నారు.

– కడలి వెంకట సత్యనారాయణ, రైతు, పెనుమదం

మోటార్ సైకిల్ ఎత్తుకు పోయారు



మద్యం షాపు ఎదురుగా తనకు వ్యవసాయ భూమి ఉంది. తాళం వేసిన నా స్పెండర్ మోటార్ సైకిల్ ఎత్తుకు పోయారు. రెండేళ్ల క్రితమే ఆ మోటార్ సైకిల్ కొనుక్కున్నా. మద్యం మత్తులో మందుబాబులు విచక్షణ కోల్పోయి ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు.

– పూసల వెంకట సుబ్బారావు, రైతు, పెనుమదం

కార్తీకమాసం ఏర్పాట్లు పూర్తి చేయాలి



అమరేశ్వరఘాట్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: కార్తీకమాసం పురస్కరించుకుని పట్టణంలో గోదావరి రేవుల వద్ద తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. బుధవారం ఆయన గోదావరి ఘాట్‌ల వద్ద జరుగుతున్న పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీకమాసంలో పవిత్ర స్నానాలు చేయడానికి దూరప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వస్తారని వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వలందర్‌రేవు, లలితాంబఘాట్, అమరేశ్వరఘాట్‌ల వద్ద ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రేవుల వద్ద లైటింగ్ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. వలందర్‌రేవులో జల్లు స్నానం చేయడానికి వీలుగా మోటార్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్లాని అధికారులను ఆదేశించారు. అలాగే కపిల మల్లేశ్వరస్వామి ఆలయం, అమరేశ్వరస్వామి ఆలయం వద్ద కూడా ఏర్పాట్లు చేయాలన్నారు.

రోడ్డు మీద పశువులతో ఇబ్బందులు



బోళ్లవారి లేఅవుట్ వద్ద రోడ్డు మీద పశువులను కట్టిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని నాగరాజుపేట నుంచి వడ్లవానిపాలెం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో బోళ్లవారి లేఅవుట్ వద్ద రోడ్డు మీద ఆవులు, గేదెలను కడుతున్నారు. దీంతో ఆ రోడ్డు మీద వెళ్లే ద్విచక్రవాహణదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని పాలకొల్లు రూరల్ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని బాటసారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులు రోడ్డుమీద అడ్డంగా నిలబడడంతో మోటార్ సైకిళ్ల మీద వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భయపెడుతున్న టపాసుల ధరలు

- గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగిన ధరలు
- వ్యాపారులకు ఆందోళన కలిగిస్తున్న వాతావరణం



పాలకొల్లురోడ్డులో చినమామిడిపల్లి వద్ద హోల్‌సేల్ దుకాణంవద్ద అమ్మకాలు సాగిస్తున్న దృశ్యం



పెనుగొండలో ప్రమిదల దుకాణాలు

పెనుగొండ/నరసాపురం రూరల్: టపాసుల శబ్దాలు.. వెలుగులు విరజిమ్మే మతాబులతో ఉత్సాహంగా జరుపుకొనే దీపావళి పండుగకు ధరాఘాతం వెంటాడుతుంది. దీపావళి పండుగకు రెండు మూడు రోజుల ముందు నుంచే గ్రామాల్లో టపాసుల శబ్దంతో చిన్నారులు హోరెత్తిస్తుంటారు. అయితే పెరిగిన ధరలతో గ్రామాల్లో ఎక్కడా దీపావళి సందడి ఇంకా ప్రారంభం కాలేదు. గురువారం దీపావళి నేపథ్యంలో పెద్ద సంఖ్యలో బాణ సంచా దుకాణాలు వెలిశాయి. ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో సతమతం అవుతున్న మధ్యతరగతి కుటుంబాల్లో దీపావళికి ప్రత్యేకత లేకుండా పోయింది. ముఖ్యంగా నూనె ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో ప్రమిదలు కొనేందుకు కూడా మహిళలు ముందుకు రావడం లేదని వ్యాపారస్తులు వాపోతున్నారు. అలాగే దీపావళి టపాసుల ధరలు పెరిగిపోవడంతో డీలా పడుతున్నారు.

దీపావళి టపాసుల ధరలు ఇలా

గతేడాదికన్నా 20 శాతంకు పైగా ధరలు పెరిగాయి. ముఖ్యంగా పేలుడు ఐటమ్స్ ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పేలుడు వాటిని పక్కన పెట్టి వెలుగులు నింపే చిన్నచిన్న కాకరపువ్వత్తులు, తాళ్లు,మతాబులు వంటి వాటితో సర్దుకోవాలను కొంటున్నారు. కాకర్స్ చిన్నవి రూ.15 నుంచి రూ. 20 వరకూ, పెద్దవి రూ.60 నుంచి రూ. 70 వరకూ, తాళ్లు రూ.100కు పైగాను, చిన్నవి రూ.60కి, చిచ్చుబుడ్లు కంపెనీ తయారీ రూ. 100 నుంచి రూ. 200 వరకూ, లక్ష్మీ బాంబులు రూ.40 పైగా, సీమ టపాసులు రూ.100 నుంచి రూ.5 వేలు వరకూ, షాట్స్ రూ.500 నుంచి రూ.3000 వరకూ, మతాబులు రూ.180 నుంచి రూ.220 వరకూ, పెన్సిల్స్ రూ.100 నుంచి రూ.200 వరకూ, మల్టీ కలర్ చిచ్చుబుడ్లు రూ.100 నుంచి 150 వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో చిన్న కుటుంబం సైతం దీపావళి టపాసులకు కనీసం రూ. 600 నుంచి 1000 వరకూ ఖర్చు చేయాల్సి రావడంతో పేద మధ్య తరగతి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నానాజీ ట్రస్ట్ ఏర్పాటు



నానాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, అభిమానులు

పెనుగొండ: డీసీసీబీ డైరెక్టరు, పెనుగొండ సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి లక్ష్మయ్యనాయుడు(నానాజీ) పేరున నానాజీ ట్రస్టును ఏర్పాటు చేశారు. బుధవారం పెనుగొండలో నిర్వహించిన నానాజీ సంతాప సభలో నానాజీ అభిమానులు ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి, ఇతర సేవా కార్యక్రమాలకు ట్రస్ట్ ద్వారా సేవలు అందించనున్నట్లు తెలిపారు. మూలధనంగా మునమర్రుకు చెందిన తోట మెహర్ రూ.లక్ష, పెనుగొండకు చెందిన గాజుల బులి పుల్లారావు రూ.లక్ష, అత్తిలికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు రూ.లక్ష, కంకిపాడుకు చెందిన గొడిగొయ్యల వివేకానంద స్వామి రూ.లక్ష, పెనుగొండ సొసైటీ ఉపాధ్యక్షుడు నక్కా వేద వ్యాస శాస్త్రి రూ.50 వేలు విరాళం ప్రకటించారు. బుధవారం నానాజీ నివాసం వద్ద జరిగిన సంతాప సభలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, మాజీ మంత్రులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ శాసన సభ్యుడు బూరుగపల్లి శేషారావు, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆకులు బాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, విశ్రాంత ఆచార్య డాక్టర్ ఆర్.రామ్మోహనరావు, ఎస్వీకేపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, చెరుకువాడ నరేష్ రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్ర మౌళీశ్వర రెడ్డి పాల్గొని నానాజీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

కాలువ రేవుల పనులు ప్రారంభం



కాలువ రేవు గట్టుపై ఉన్న సిల్ట్ తీయిస్తున్న కమిషనర్ విజయసారథి



కాలువ గట్టున తుప్పలు తొలగిస్తున్న పనులు పరిశీలిస్తున్న కమిషనర్ విజయసారథి

సాక్షి స్పందన

పాలకొల్లు సెంట్రల్: కాలువ రేవులు అధ్వానం అని సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. బుధవారం కెనాల్ రోడ్డులో ఉన్న కాలువ రేవులను శుభ్రం చేయించారు. భక్తులకు అతి చేరువగా ఉండే ఎర్రవంతెన పక్కన ఉన్న రెండు రేవులు అత్యంత అధ్వానంగా ఉండడంతో వాటిని బాగుచేయించడమే కాకుండా కాలువ గట్టున ఉన్న చెత్త, ముళ్ల కంపలను తొలగించారు. ఒక రేవు వద్ద కాలువ నిండుడగా ఉన్నా నీరు రాని పరిస్థితి ఏర్పడడంతో ఆ రేవు వద్ద మట్టిని తొలగించే పనులు చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ బి.విజయసారధి స్పందించి రేవులు మరమ్మతులు చేయించడంతో స్థానిక ప్రజలు, స్వాములు, కార్తీకమాసం భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేస్ట్ డీ-కంపోజర్‌తో కలుపు నివారణ



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

యలమంచిలి: ఊడ్చని చేలలో కలుపు నివారణకు వేస్ట్ డీ-కంపోజర్ విధానం సరైనదని నరసాపురం ప్రాంతీయ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి చెప్పారు. కాజ పడమర, గుంపర్రు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక వర్షాలు, తుఫాన్‌లు వల్లచాలా గ్రామాలలో వరి చేలు ఊడ్చకపోవడంతో కలుపు విపరీతంగా పెరిగిపోయిందని, దీని వల్ల ఎలుకలు పెరిగి ఊడ్చిన చేలలో పంట నష్టానికి గురిచేస్తున్నాయని రైతులు వాపోయారు. దీనిపై అనిలకుమారి స్పందిస్తూ వేస్ట్ డికంపోజర్ అమెజాన్ లభిస్తుందన్నారు. ఒక బాటిల్ ఖరీదు రూ.30 ఉంటుందన్నారు. దానిని ఆర్డర్ పెట్టుకుని వచ్చిన తరువాత, ఒక డ్రమ్‌లో 200 లీటర్ల నీటిని తీసుకుని దానిలో కలపాలన్నారు. అలాగే ఇందులో 2 కేజీల బెల్లాన్ని కూడా వేసి ఒక 10 రోజుల పాటు ఉదయం, సాయంత్రం కర్రతో కలుపుతూ ఉండాలన్నారు. అలా 10 రోజులకు వేస్ట్ డీ-కంపోజర్ మిశ్రమం తయారవుతుందన్నారు. అనంతరం కలుపు పట్టిన చేనును ఒక్కసారి దుక్కి దున్ని, తరువాత వేస్ట్ డికంపోజర్ మిశ్రమాన్ని చేనంతా పిచికారీ చేయాలన్నారు. ఈ విధంగా కలుపు మొక్కలు తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, ఎంపీటీసీ సభ్యుడు జిల్లెళ్ల రత్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండి: మండలంలోని ఉణుదుర్రు గ్రామానికి చెందిన అద్దంకి నాని(44) విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నాని ఈ నెల 29న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. మెరుగైన చికిత్స నిమితం విజయవాడకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ఆస్పత్రి నుంచి సమాచారం రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కుబడిగా పొలం పిలుస్తుంది కార్యక్రమాలు

కనిపించని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు



యర్రంశెట్టివారిపాలెం గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారితో నిర్వహిస్తున్న పొలం పిలుస్తుంది సభ (ఫైల్)



సారవ గ్రామంలో ఫ్లెక్సీతో ఫొటోలకు ఫోజు ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారులు, నాయకులు (ఫైల్)

నరసాపురం రూరల్: రైతులకు పంటల సాగులో ఉన్న సందేహాలను నివృత్తి చేసి తక్కువ పెట్టుబడులతో మేలైన దిగుబడి కల్పించేలా ఎంతో ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమం పొలం పిలుస్తుంది. కూటమి ప్రభుత్వం హంగూ ఆర్భాటాలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు మినహా అనుబంధ శాఖల అధికారులెవరూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం లేదంటే ఈ కార్యక్రమం ఏ విధంగా నిర్వహిస్తున్నారో? అర్థం చేసుకోవచ్చు.

ఫొటోలకు ఫోజులతో సరి

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సాగు వ్యయం తగ్గింపు, మెరుగైన సాగు పద్ధతులు, మేలైన రకాల వ్యవసాయ ఉత్పత్తుల వంగడాలపై అవగాహన, ఉత్తమ సాగు పద్ధతులపై అవగాహన, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రైతులకు సాగులో ఆదాయాన్ని పెంచేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. రైతులు, శాస్త్రవేత్తలతో నేరుగా ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సి ఉంది. ఇందుకు ప్రతీ మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో క్షేత్ర సందర్శన, రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి. కానీ ఇవన్నీ క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదు. ఇతర శాఖల అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమానికి డుమ్మా కొడుతూ పథక ఉద్దేశాన్ని నీరుగారుస్తున్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు కూడా ముందుగానే నిర్ణయించిన మేరకు కూటమి నేతల సానుభూతి పరుల పొలాల్లోకి వెళ్లి ఫొటోలకు ఫోజులిచ్చి వెళ్లిపోతున్నారు. వ్యవసాయాధికారులు అక్కడక్కడా ఒకరిద్దరు అధికారులు మినహా ఎక్కడా అనుబంధ శాఖల అధికారులు ఆచూకీ లేదు. వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యాన, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ, వ్యవసాయమార్కెటింగ్ తదితర శాఖలతో పాటు కెనాల్స్, ఇరిగేషన్, ప్రకృతి వ్యవసాయం వంటి శాఖల అధికారులు ఈ కార్యక్రమాలకు హాజరు కాకున్నా వ్యవసాయశాఖ అధికారులు మమ అనిపిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు హాజరు కాకపోయినప్పటికీ వారి బంధువులు, సన్నిహితులతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.